# ఛార్లొట్స్ విల్లె హింసాకాండ అమెరికాలో పెరుగుతున్న ఫాసిస్టు ధోరణులు

**అమెరికాలోని** వర్జీనియా రాష్ట్రంలో ఛార్లొట్స్ విల్లెలో జరిగిన హింసాకాండ అమెరికాలో పెరుగుతున్న ఫాసిస్టు ధోరణులకు అద్దంపట్టే మరో సంఘటన.

అమెరికా చరిత్రలో బానిస విధానాన్ని కొనసాగించాలనే కన్ఫెడరేట్లకు, బానిస విధానాన్ని అంతమొందించాలనే యూనియనిస్టులకు మధ్య అంతర్యుద్ధం జరిగింది. ఆఫ్రికాలో ప్రజలను బందీలుగా పట్టుకొని అమెరికాకు రవాణాచేసి వారిని బలవంతంగా బానిసలుగా చేసుకొని శ్వేత జాతీయులు తమ పొలాల్లో చాకిరీ చేయించుకున్నారనేది జగమెరిగిన సత్యం. అబ్రహాంలింకన్ నాయకత్వాన జరిగిన అంతర్యుద్ధం కారణంగా బానిసవిధానం రద్దయింది. బానిసత్వం నుండి నల్ల జాతీయులను విముక్తిచేసిన సాహసోపేత పోరాట యోధునిగా చరిత్ర అబ్రహాంలింకన్‌ను స్మరించుకుంటుంది.

అయినా జాతివాదం, జాతివివక్షత మరియు అణచివేతలు వివిధ రూపాల్లో కొనసాగుతూనే వున్నాయి. వీటిని పాలకవర్గాలు పరోక్షంగానో, ప్రత్యక్షంగానో ఉపయోగించుకుంటూనే వున్నాయి. ఆఫ్రో అమెరికన్ ప్రజలు, సమాజంలో తమకు సమానమైన స్థానం కొరకు, హక్కుల కొరకు వారి గొప్ప నాయకుడు మార్టిన్ లూథర్‌కింగ్ నాయకత్వాన పోరాడినా, అమెరికా సమాజంలో శ్వేత జాత్యహంకార భావజాలం వ్యాప్తి చెందుతూనే వుంది. తరచుగా ఈ శ్వేతజాత్యహంకారులు కొన్ని సంస్థలనేర్పాటు చేసుకొని హింసకు పాల్పడుతున్నారు.

ఈ నేపథ్యంలో జాతివాదానికి వ్యతిరేకంగా చైతన్యం పెరుగుతున్నందున ఛార్లొట్స్‌విల్లె నగరంలోని పార్క్‌లో వున్న కన్ఫెడరేట్ల జనరల్ అయిన రాబర్ట్ ఇ లీ విగ్రహాన్ని తొలగించాలని నగర కౌన్సిల్ నిర్ణయించింది. 1924లో ఎవరో దాతలు యిచ్చిన కారణంగా అతని విగ్రహాన్ని ఏర్పాటుచేశారనీ, జాతి అణచివేత జ్ఞాపకాలను తలపింపజేయడంతప్ప దీనితో పట్టణానికి ఒరిగేదేమీ లేనందున దీన్ని తొలగించాలని నిర్ణయించామని ప్రకటించింది.

జాతివాదులు, నయా నాజీ బృందాలు పట్టణంలో సమావేశమై విగ్రహ తొలగింపు ప్రతిపాదనను వ్యతిరేకించాలని నిర్ణయించారు. వీరు విశ్వవిద్యాలయ ప్రాంగణంగుండా స్వైర విహారం చేసుకుంటూ విద్యార్థులను, పరిసర ప్రాంత ప్రజలను భయభ్రాంతులను చేశారు. ప్రక్కనే నిలబడివున్న పోలీసులు వెకిలి నవ్వులు నవ్వుతూ, కనుసైగలు చేస్తూ దాడులకు పాల్పడుతున్న వారిని మరింత ప్రోత్సహించారు. ఈ గుంపు 32 ఏళ్ళ న్యాయ సహాయకుడిని చంపివేసింది. మరో 19 మందిని గాయపర్చింది.

కన్ఫెడరేట్ల చిహ్నాలు, పురావస్తువులను చాలామంది అమెరికన్లు అసహనానికి చిహ్నంగా పరిగణిస్తారు. ఫ్లోరిడా, కెంటకి, మేరీలాండ్, ఉత్తర కరోలినా, టెనెస్సీ, మరియు టెక్సాస్ తదితర చాలా రాష్ట్రాలు కన్ఫెడరేట్ నాయకుల విగ్రహాలను తొలగించాలని నిర్ణయించు కుంటున్నాయి. కాని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ శ్వేతజాత్యహంకారులను, జాతివివక్ష వ్యతిరేకులను ఒకేగాట కడ్తున్నాడు. ఆయన మాటల్లోనే “మీకు ఒకవైపు దుష్ట ముఠా వుంది. మరోవైపు వున్న ముఠా కూడా చాలా హింసాయుతమైనది. ఈ విషయం ఎవరూ చెప్పడానికి యిష్టపడడంలేదు. నేను ఖచ్చితంగా చెప్తాను” అని ప్రకటించాడు.

వర్జీనియా విశ్వవిద్యాలయంలో జొరబడ్డ శ్వేతజాతివాదుల చేష్టలు అక్కడి ప్రజలను ఆశ్చర్య చకితులను చేశాయని అనేక మీడియా కథనాలు సూచించాయి. వారి ఆగడాలను అడ్డుకున్నవారిని కపట ధోరణితో “వామపక్ష హింసాకారులు”గా ముద్రవేయడం, అనేకమంది అమెరికన్లకు కోపం తెప్పించింది. కన్ఫెడరేట్ నాయకుల విగ్రహాలను తొలగించాలనే వివిధ రాష్ట్రాల చర్యలను ట్రంప్ విమర్శిస్తూ యిలా అన్నాడు : “అంటే ఈ వారం రాబర్ట్ ఇలీది. వచ్చేవారం జార్జ్ వాషింగ్టన్‌దా అని నాకు ఆశ్చర్యంగా వుంది. ఆపై వారం థామస్‌జెఫర్‌సన్ దవుతుందా?”

అమెరికా రాజకీయరంగంలో వున్నవారందరూ ఛార్లొట్స్‌విల్లె హింసాకాండను ఖండించారు. డెమొక్రాట్లు, కొందరు రిపబ్లికన్లు, పశ్చిమ ఐరోపా నాయకులు ఈ హింసాకాండ పట్ల తమ కోపోద్రిక్తతను ప్రకటించారు. వీరందరి విమర్శల్లో ఒక సాధారణ అంశం వుంది. వీరంతా జాతివాదులను, నయా నాజీ శక్తులను ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రోత్సహిస్తూ హింసకు కారణమవుతున్న చర్యలపై ట్రంప్‌ను నిందిస్తున్నారు.

డెమొక్రటిక్ పార్టీ కొరకు మాట్లాడే ‘న్యూయార్క్ టైమ్స్’ పత్రిక ఆగస్టు 14న తన సంపాదకీయంలో హింసకు కారణమవుతున్న శ్వేతజాత్యహంకార ముఠాలను ఖండించకపోవడంపై ట్రంప్‌ను విమర్శించింది. ఈ పత్రిక ట్రంప్‌ను “ఆధునిక అమెరికా అధ్యక్షుల చరిత్రలో తనకు సేవలందించడానికి విద్వేషం, అసహనాలను వెళ్ళగక్కే రాక్షసులను ఆహ్వానిస్తున్న ఏకైక వ్యక్తి” అని ప్రకటించింది. జర్మనీ ప్రభుత్వ అధికార ప్రతినిధి అమెరికాలోని డెమొక్రాట్లను ఈ హింసను నివారించడానికి పూనుకోవాల్సిందిగా పిలుపునిచ్చారు. అయితే అదే సందర్భంలో జర్మనీ తన దేశంలో వలస వచ్చిన ప్రజల వ్యతిరేక ప్రచారంతో నయా నాజీ శక్తులను ప్రోత్సహిస్తోంది.

"దుష్ట ట్రంప్" అనే ఈ చిత్రీకరణ, సమస్యను విశ్లేషించేదేమీ వుండదు. పైగా ఇది అమెరికాలో తిష్టవేసుకొని అదుపులోకి రాకుండా వున్న ఫాసిస్టు ధోరణుల పెరుగుదలకు దోహదపడ్తున్న అసలు సంక్షోభం నుండి ప్రజల దృష్టిని ప్రక్కకు మళ్ళిస్తుంది.

అనేకమంది ప్రజలు ట్రంప్‌ను దుష్టుడిగా పరిగణిస్తున్నారు. ఆయన చేసే విధాన ప్రకటనలను అతని వ్యక్తిగత లక్షణాలకు ఆపాదిస్తున్నారు. కాని వీరు అసలు వాస్తవాన్ని చూడలేకపోతున్నారు. అసలు వాస్తవమేమంటే ద్రవ్య గుత్తసంస్థలకు ట్రంప్ ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. అమెరికా రాజకీయ వ్యవస్థలో పెరుగుతున్న ఫాసిస్టు ధోరణుల నుండి పుట్టిన నాయకుడే ట్రంప్. తీవ్ర సంక్షోభంలో వున్న పెట్టుబడిదారీ విధానం నుండే ఫాసిజం ఉద్భవిస్తుందనేది జగమెరిగిన సత్యం.

నిక్సన్ అధ్యక్షకాలంలో జరిగిన వాటర్ గేట్ కుంభకోణం, అమెరికా సామ్రాజ్యవాదుల నేరపూరిత చర్యలను ప్రపంచమంతా తెలియజేసింది. ఆఫ్ఘనిస్తాన్‌పై కార్టర్ చేసిన అమెరికా యుద్ధం, అల్‌ఖైదాను సృష్టించింది. నికరగువా ప్రభుత్వాన్ని లొంగదీసుకోడానికి రీగన్ కార్యక్రమం ప్రారంభించాడు. సీనియర్ బుష్ పనామాపై దాడిచేశాడు, ఇరాక్‌పై మొదటి సైనిక దురాక్రమణకు పాల్పడ్డాడు. ఇరాక్‌పై క్లింటన్ బాంబుల వర్షం కురిపించి, ఆంక్షలు విధించి యుద్ధానికి తెరతీశాడు. ఇరాక్, లిబియాలపై జూనియర్ బుష్ యుద్ధాలను ప్రారంభించి లక్షలాదిమంది ప్రజలను బలిగొన్నాడు. చిత్రహింసను అణచివేతకు ఒక సాధనంగా ఉపయోగించే విధానానికి ఆమోదముద్ర వేశాడు. ఇక "ఆశాకిరణం", "మార్పు"కు ప్రతినిధిగా అభివర్ణింపబడిన అధ్యక్షుడు ఒబామా విషయం చూద్దాం. పైలెట్‌రహిత విమాన దాడులతో హత్యలుగావించటానికి, తమ దేశ ప్రజలపైనే గూఢచర్యం జరిపేదానికి ఈయన ఒక పవిత్రతను ఆపాదించాడు. అదే సందర్భంలో ఆర్ధిక తిమింగలాల లబ్ధికొరకు వందల బిలియన్ల డాలర్లను లెక్కలేకుండా ఖర్చు చేశాడు.

అమెరికా సమాజాన్ని ఆర్ధిక గుత్తాధిపతులు నియంత్రిస్తున్నారు. అది ఇప్పుడు అదుపులో లేనంతగా ఆర్ధిక సంక్షోభం అనే ఊబిలో కురుకుపోయి వుంది. ఈ పరిస్థితి వల్ల పెరుగుతున్న ఫాసిస్టు ధోరణులుగానే ఛార్లొట్స్ విల్లె సంఘటనలను, ట్రంప్ అతని వ్యతిరేకుల స్పందనలను పరిగణనలోకి తీసుకోవాలి. పెట్టుబడిదారీ విధానం ప్రజలకు ప్రజాస్వామ్యం, సమానత్వం, స్వేచ్ఛ లాంటి విషయాలను బోధిస్తుంది. కాని అది సంక్షోభ సమయాల్లో వీటికి భిన్నంగా పూర్తి వ్యతిరేకమైన ఫాసిస్టు పద్ధతులను ఆశ్రయించి ఫాసిస్టు సమాజంగా మార్చి వేస్తుంది. పెట్టుబడిదారీ విధాన చరిత్ర మనకు తెలియజేస్తున్న అంశం యిదే. ప్రపంచ శ్రామికుల ఐక్యవర్గ పోరాటం మాత్రమే ఈ ఫాసిజాన్ని నిలువరించ గలదు. రెండవ ప్రపంచ యుద్ధ అనుభవాలు మనకు ఈ విషయమే తెలియజేస్తున్నాయి. ఎందుకంటే రెండవ ప్రపంచయుద్ధంలో రష్యా బోల్షివిక్ పార్టీ నాయకత్వాన సోవియట్ శ్రామిక ప్రజల వీరోచిత పోరాటమే ఫాసిస్టు జర్మనీని ఓడించింది.

ఛార్లొట్స్ విల్లె హింసాకాండ, దీనిని నియంత్రించాల్సిన శక్తుల స్పందన వల్ల అధిక సంఖ్యాక అమెరికన్లు కోపోద్రిక్తులవుతున్నారు. జాతివాదానికి వ్యతిరేకంగా వేలాదిమంది నిరసనకారులు బోస్టన్ వీధులలో వరదలా వెల్లువెత్తారు. శ్వేతజాత్యహంకారుల గుంపు వీరి ముందు ఉనికి కోల్పోయింది. ఏరియల్ ఫోటోలు పరిశీలిస్తే ప్రదర్శనకారులు బోస్టన్‌లోని ఒక ప్రధాన రహదారి నిండా బ్లాకులుగా నిండిపోయారు. వీరు నలభైవేలకు పైగా వుంటారని అధికారుల అంచనా. పోరాటాలకు దూరంగా వుండే ముఠాలు చేసిన 'స్వేచ్ఛా ప్రసంగం' యొక్క ఊరేగింపులో కొన్ని డజన్లమందే వున్నారు. వీరి ర్యాలీ బయలుదేరడానికి అరగంట ముందునుండే పోలీసుల బందోబస్తు మొదలైంది. కనుక అమెరికా కార్మికవర్గమే జాతివాదానికి, విద్వేష ప్రచారాలకు వ్యతిరేకంగా తిరిగి పోరాడుతుందనేది స్పష్టం.

oooooo